క్లుప్తంగా

లైఫ్ సర్టిఫికెట్ల అందజేత



లోలుగులో కుటుంబ పింఛన్‌దారుకు ఫొటో తీస్తున్న సంఘం సభ్యులు

పొందూరు: అస్వస్థతతో కదలలేని స్థితిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛన్‌దారులకు స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నేరుగా ఇంటి వద్దే జీవిత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారు. పొందూరు, వాండ్రంగి, లోలుగు తదితర గ్రామాల్లో గురువారం 11 మందికి సర్టిఫికెట్లను సభ్యులు గురువారం అందజేశారు. ఇంత వరకు 40 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి చివరి వారం వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 9441249793ను సంప్రదించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సూర్యప్రకాషరావు, వాండ్రంగి దామోదరరావు, వడగా సూర్యారావు, దివాకర్ పాత్రో పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పెద్దలోదిగిలో దర్శనమిస్తున్న ఫ్లెక్సీ

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను బుధవారం ఎన్నికల సంఘం విడుదల చేసింది. గురువారం జిల్లా కలెక్టర్ కూడా జిల్లాలో ఎన్నిక కోడ్ అమలులో ఉంటుందని ప్రకటించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల కూడళ్లలో కూటమి నాయకుల ఫ్లెక్సీలు అలాగే కనిపిస్తున్నాయి. పాతపట్నంలోని పంచాయతీ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, ఆల్ ఆంధ్రా రోడ్డు, సరాలి, ప్రభుత్వ ఆస్పత్రి, నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం, కొరసవాడ, కాగువాడ, సీది, పెద్దలోగిడి, గంగువాడ, తెంబూరు గ్రామాల్లో కూటమి నాయకుల ఫ్లెక్సీలను తొలగించలేదు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ అన్నదొర

కొత్తూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీతంపేట ఐటీడీఏ డీడీ అన్నదొర అన్నారు. మండలంలోని లబ్బ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు హాజరు, పాఠశాల గదులు, వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లను పరిశీలించారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



సీఐ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

పాతపట్నం: స్థానిక దువ్వారి వీధికి చెందిన విలేకరి పెద్దింటి తిరుపతి రావుపై ఈ నెల 20వ తేదీన హత్యాప్రయత్నం చేసిన వ్యక్తులను గుర్తించి, అరెస్ట్ చేయాలని పాతపట్నం విలేకరుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం పాతపట్నం సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వి.రామారావుకు వినతిపత్రం అందజేశారు. పోలాకి వెంకటరమణ, జగన్, కోట్ని శ్రీను, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఆమదాలవలస: తాన్ని పూరను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, అధ్యాపకులు

హిరమండలం: శ్రీకాకుళం పట్టణంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భేటీ బచావో భేటీ పడావో చాంపియన్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కేజీబీవీ విద్యాలయాల్లో 2023–24లో పదో తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో హిరమండలం కేజీబీవీ నిలిచింది. వంజరాపు శ్రావ్య (583), కూర్మ ఉమాదేవి (572)ని సత్కరించి, నగదుతోపాటు జ్ఞాపికలను డీఈఓ తిరుమల చైతన్య, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అందజేశారు. విద్యార్థినులను సర్వశిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ శశిభూషణ్, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

ఇంటర్ విద్యార్థినికి..

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని తాన్ని పూర్ణకు కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్, అధ్యాపకులు కలాశాలలో గురువారం అభినందనలు తెలిపారు. శ్రీకాకాకుళంలో బుధవారం జరిగిన భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమంలో విద్యార్థినికి రూ.2,500 నగదు బహుమతి అందించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 434 మార్కులు సాధించింది.

మైనర్ల దూకుడు!



అలుదులో ద్విచక్ర వాహనం నడుపుతున్న మైనర్

15 కేసులు నమోదు

నరసన్నపేట నియోజకవర్గంలో ఈ ఏడాది జనవరి 1 నుంచి 30 వరకు మైనర్ల వాహన డ్రైవింగ్‌పై 15 కేసులు నమోదయ్యాయి. నరసన్నపేట మండలంలో 9 మంది, సారవకోటలో ముగ్గురు, జలుమూరు, పోలాకి మండలాల్లో ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేశారు. వాహనం నడిపే మైనర్ల తల్లిదండ్రులకు పిలిపించి కౌన్సింగ్ కూడా ఇచ్చారు.

- ద్విచక్ర వాహనాలతో హల్‌చల్
- బైక్‌లను నియంత్రించే శక్తి లేకపోయినా అతివేగంతో ప్రయాణం
- తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినా ఫలితం శూన్యం

సారవకోట: పిల్లలకు ఎలాంటి లోటు రానివ్వకూడదనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారికి ద్విచక్ర వాహనాలను కూడా ఇస్తున్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన లేని మైనర్లు అతివేగంగా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బైక్‌ను నియంత్రించే సామర్థ్యం లేకపోయినా రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడుతున్నారు. మైనర్ల డ్రైవింగ్‌తో అవతలి వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి.

రయ్.. రయ్.. మంటూ..

ఇటీవల కాలంలో మైనర్లు ఎక్కడ చూసినా రయ్.. రయ్ మంటూ బైక్‌లపై దూసుకుపోతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలను నడపటం నేర్పించగానే.. వారే స్వయంగా వాహనాన్ని నడిపేలా ప్రోత్సహించడం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతోంది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో మైనర్లు బైక్‌లను తీసుకెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొంతమంది గాయాలతో బయటపడుతుండగా.. మరి కొందరు శాశ్వత వైకల్యం బారిన పడుతున్నారు.

కొన్ని ఘటనల్లో ప్రాణాలు కూడా కోల్పోతుండటంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటుంది.

చట్టం ఏం చెబుతోంది..

మోటార్ వాహన చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన వారు గేర్లు లేని సాధారణ వాహనం నడిపేందుకు అవకాశం ఉంది. 18 ఏళ్లు నిండిన తరువాత డ్రైవింగ్ అనుమతి పొందడానికి ఇతర వాహనాలు నడిపేందుకు చట్టం అంగీకరిస్తుంది. అర్హత ఉన్న వారికి రవాణా శాఖ ఆధ్వర్యంలో తగిన పరీక్షలు నిర్వహించిన తరువాత డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మైనర్ వాహనం నడుపుతూ పట్టుబడితే చట్టపరంగా శిక్షకు అర్హుడే. అదే సమయంలో వాహన యజమానిపైనా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది.

వద్దు అని చెప్పే వారేరి..

రహదారి నిబంధనలు కఠినంగానే ఉన్నా.. వాటి అమలు మాత్రం నీరుగారుతోంది. పిల్లలు వాహనాలు నడుపుతుంటే చూసి ముచ్చటపడే కుటుంబ సభ్యులు ఉన్నారే తప్ప.. వద్దని వారించే వారు చాలా తక్కువ. పాఠశాల స్థాయి విద్యార్థులు ద్విచక్ర వాహనాలను రద్దీ రోడ్లపై నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారంటే పరిస్థితి తీవ్రత అంచనా వేయవచ్చు.

అవగాహన కల్పిస్తున్నప్పటికీ..

పోలీసులు తరచూ వాహన తనిఖీలు చేస్తూ పట్టుబడిన వారికి అవగాహన కల్పిస్తున్నారు. మైనర్లు వాహనం నడపొద్దు, ఎవరైనా పట్టుబడితే సంబంధిత వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరిస్తూనే ఉన్నారు. వాహన యజమానులు, మైనర్ల కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నా.. పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదు.



ఇటీవల నరసన్నపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మైనర్

తల్లిదండ్రులదే బాధ్యత



నిబంధనల ప్రకారం 18 ఏళ్లు దాటిన వ్యక్తి కూడా డ్రైవింగ్ లైసెన్స్ పొందకుండా వాహనం నడపకూడదు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత. పిల్లలపై పెద్దల పర్యవేక్షణ ఉండాలి. తగిన వయస్సు వచ్చేంతవరకు పిల్లలకు డ్రైవింగ్ నేర్పించకూడదు. చిన్నతనంలోనే ఖరీదైన వాహనాలు ఇప్పిస్తుండటంతో అధిక శాతం మంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

– జె.శ్రీనివాసరావు, సీఐ, నరసన్నపేట

మోసం.. చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఎన్నికల సమయంలో అలవికాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శించారు. పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను సీఎం చంద్రబాబు మరోసారి మోసం చేశారన్నారు. సంపద లేదని, సంక్షేమ పథకాలు ఇవ్వలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు తెలియదా అని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాలు, 18 ఏళ్లు దాటిన మహిళలకు రూ.1,500, ఎస్టీ, ఎస్సీ, బీసీల్లో 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు, అమ్మకు వందనం రూ.15 వేలు అందజేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని కొండలు, గ్రావెల్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఆయన అనుచరులు దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ, ఫారెస్ట్ రిజర్వ్ భూములు ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కోవిడ్ సమయంలోనూ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, రెడ్డి రామారావు, కొత్తూరు, మెళియాపుట్టి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు సి.హెచ్.సూర్యనారాయణ, ఉర్లాన బాలరాజు, పాతపట్నం, హిరమండలం, ఎల్.ఎన్.పేట ఏఎంసీ మాజీ చైర్మన్‌లు కొండాల అర్జునుడు, ఎ.వి.సురేష్, కొల్ల కృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, సవిరిగాన ప్రదీప్, మీసాల రామకృష్ణ, పల్లి యోగి, గడ్డవలస ఆనంద్, ఎనుగుతల సూర్యం, వి.లక్ష్మీనారాయణ, తూలుగు ప్రవీణ్, భాస్కర్‌దాస్, నాగేంద్ర, బమ్మిడి ఖగేశ్వరరావు, పోలాకి జయమునిరావు, చిన్నారావు, శిమ్మ సాంబ, పద్మ నేతాజీ, ధర్మా, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలు చేర్చడంలో అధికారుల విఫలం

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ

ఆమదాలవలస: సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్ష ప్రశ్నపత్రాలను స్కూల్ పాయింట్ వద్దకు చేర్చాలనే నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు.. ఉపాధ్యాయులనే తీసుకువెళ్లమనడం సరికాదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్టీయు సేవా కేంద్రం ప్రారంభానికి గురువారం విచ్చేశారు. ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయాన్నే ప్రశ్నపత్రాల కోసం వెళ్లి ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. ఎంసెట్, నీట్, జేఈఈ వంటి పరీక్షలకు మించి ఫార్మేటివ్, సెమ్మేటివ్‌లో ఎక్కడాలేని హడావిడి చేస్తున్నారన్నారు. పలు అంశాలపై చర్చించారు. కార్యవర్గ సభ్యులు పి.రామకృ, బి.రమేష్ కుమార్, పి.అన్నాజీ బాబు, ఎ.గోపి, బి.మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ

సంక్షిప్తంగా

పెయిన్ కిల్లర్ల వాడకం తగ్గిద్దాం

సారవకోట: పీహెచ్‌సీల్లో వైద్య సేవలు మరింత మెరుగు పర్చాలని డీఎంహెచ్‌ఓ టి.బాలమురళీ కృష్ణ సూచించారు. గురువారం మండలంలోని బొంతు పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులున్నారని వారిలో ఒకరు పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలని, ఒకరు మొబైల్ వాహనం ద్వారా కేటాయించిన గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందించాలన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. పెద్దలంబ గ్రామస్తులు పెయిన్ కిల్లర్స్ అధికంగా వాడటం వల్ల కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని, నీటి సమస్యేదీ లేదని అన్నారు. పెయిన్ కిల్లర్లు అధికంగా వాడకూడదని అన్నారు. కిడ్నీ వ్యాధులు మందులు బొంతు పీహెచ్‌సీలో అందుబాటులోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 50 ఏళ్లు పైబడిన వారికి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మోహిని, ఆశా కోర్డినేటర్ రవి ప్రసాద్, బొంతు పీహెచ్‌సీ వైద్యులు సుస్మిత, సుధారాణి, హెల్త్ సూపర్‌వైజర్ హేమలత తదితరులున్నారు.

స్వమిత్వ సర్వేపై అవగాహన

బూర్జ: మండలంలోని గుత్తావల్లి, బూర్జ, కొల్లివలస, చీడివలస గ్రామాల్లో డీఎల్‌పీఓ వెంకటరమణారావు పర్యటించి స్వమిత్వ సర్వేపై అవగాహన కల్పించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామ కంఠాలపై హక్కుదార్లు గుర్తించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

బూర్జ: మండలంలోని మొక్కజొన్న పంట వేసే రైతులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎరువులు పంపిణీ చేశారు. డీఆర్‌ఎఫ్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్త డి.ఏసు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ప్లాటినమ్ జూబ్లీ

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సహకారంతో ప్లాటినమ్ జూబ్లీని నిర్వహిస్తామని హెచ్‌ఎం గోవిందరావు తెలిపారు. పాఠశాల ఆవరణలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్లాటినమ్ జూబ్లీ నిర్వహణకు సంబంధించి పలువురు పూర్వ విద్యార్థులు సూచనలిచ్చారు.

సాగునీరు విడుదల చేయాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి విశ్వేశ్వరరావు

సరుబుజ్జిలి: వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో రబీ పంటలకు సంబంధించి రైతులు తీవ్ర ఇక్కట్లుపడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, కొండవలస సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వంశధార ఎడమ కాలువ ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీటిని అందిన్నారన్నారు. కుడి కాలువ విషయంలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సైలాడ చెరువు ఆయకట్టు పరిధిలోని కొండవలస, సైలాడ, కుమ్మరిపేట, దివంజిపేట జొన్నవలస, పురుషోత్తపురం, చిన్నపాలెం గ్రామాలకు చెందిన సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సాగునీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ధర్మానను కలిసిన బూర్లె శ్రీనివాసరావు



ధర్మాన కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను పోలాకి మండలం మబుగాంలోని ఆయన నివాసంలో కొత్తూరు మండలం మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీకి చెందిన పార్టీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు గురువారం కలిశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని శ్రీనివాసరావుకు కృష్ణదాస్ సూచించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా న్యాయ సేవలు



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి హరిప్రియ

నరసన్నపేట: సబ్ జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని నరసన్నపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సి.హెచ్.హరిప్రియ అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను గురువారం తనిఖీ చేశారు. అవసరమైన రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే న్యాయ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జైల్లో అమలు చేస్తున్న ఆహార మెనూపై ఆరా తీశారు. వ్యక్తిగత, సరసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



కొత్తూరులోని సత్యసాయి మందిరంలో మండలంలోని పలు గిరిజన గ్రామాలకు చెందిన 27 మంది గర్భిణులకు గురువారం సామూహిక సీమంతాలను నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన జె.ఎస్.మోహన్‌రావు ఆర్థికసాయంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎల్.భగవాన్‌నాయుడు, కొంచాడ వెంకటరమణ, జామి పద్మరాజు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

- కొత్తూరు

కృతజ్ఞతలు..



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా ఇటీవల నియామకమైన కొత్తూరు మండలం ఓండ్రుజోలకు చెందిన గంధవరపు నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. పోలాకి మండలం మబుగాంలో కృష్ణదాస్‌ను గురువారం కలిశారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని నాగేంద్రకు కృష్ణదాస్ సూచించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావుకు నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ యర్లంకి ధర్మారావు, నిమ్మగడ్డ కృష్ణారావు, లింగం ఉన్నారు.

- కొత్తూరు

రోడ్డు పక్కనే చెత్త..



ఈ చిత్రం నరసన్నపేట మండలంలోని గుండవల్లిపేట వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెత్త. వీధుల్లో చెత్త కనిపించకూడదని జిల్లా కలెక్టర్ తీవ్రంగా హెచ్చరిస్తున్నా.. గ్రామ స్థాయి అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి చీమకుట్టినట్లు అయినా ఉండటంలేదు. ఇళ్లల్లోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించకుండా గ్రామ శివార్లలో, రోడ్డు పక్కనే వేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలను కూడా పట్టించుకోరా అని స్థానికులు, ప్రయాణికులు మండిపడుతున్నారు.

- నరసన్నపేట

పార్టీ పటిష్టతకు కృషి చేయండి



అనుబంధ సంఘాల అధ్యక్షులతో ధర్మాన కృష్ణదాస్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి ఉంటూ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు వీలుగా 26 అనుబంధ సంఘాల అధ్యక్షులను పార్టీ నియమించగా.. వారందరికీ గురువారం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయం వద్ద పరిచయం చేసి బాధ్యతలు అప్పగించి సత్కరించారు.

ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నేరవేర్చాలని, పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా అందరూ పాల్గొనాలన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహనరెడ్డిని చేయడమే మనందరి లక్ష్యమన్నారు. అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం ఇస్తూ పార్టీ అనుబంధ సంఘాల పదువులు ఇవ్వడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. గతంలో మనం సంక్షేమ పథకాలు ఎలా అమలు చేశామో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం



నరసన్నపేట: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పలువురు వక్తలు అన్నారు. నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ మార్గం మానవ జాతికి శాంతిని ప్రబోధిస్తుందన్నారు. సత్యం, అహింసా మార్గాలను అందించి పోరాట స్ఫూర్తిని కలిగించిన మహానుభావుడు గాంధీ అని అన్నారు. పలువురు నాయకులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గాంధీ, మను, అభ వేషధారణల్లో విద్యార్థులు



సారవకోట: అవలింగి జెడ్పీ పాఠశాలలో చిన్నారులు వేస్తున్న రంగవల్లిక



ఆమదాలవలస: వన్ వే జంక్షన్ వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి



జలుమూరు: ప్రాథమిక పాఠశాలలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు